# వంశీకి స్వర్ణం

**ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి/వాజేడు: మాల్టా వేదికగా జరిగి ప్రపంచ జూనియర్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ లిఫ్టర్ మోడం వంశీ పసిడి పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన పురుషుల 66కిలోల విభాగంలో బరిలోకి దిగిన వంశీ..బెంచ్‌ప్రెస్‌లో 140కిలోలు, స్కాట్స్ 280కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 242.5 కిలోలతో మొత్తంగా 662.5 కిలోల బరువుతో స్వర్ణ పతకంతో సత్తాచాటాడు. ఇదే విభాగంలో అంటోన్ సవ్కిన్(కజకిస్థాన్), హిరాము కోజిమ(జపాన్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన వంశీ గత కొంత కాలంగా అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ టోర్నీల్లో పతకాలు కొల్లగొడుతున్నాడు. పోటీకి దిగిన దాదాపు ప్రతీ టోర్నీలో ప్రతిభ కనబరుస్తూ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నాడు. పవర్‌లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించిన తొలి ఆదివాసీ ప్లేయర్‌గా వంశీ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు.



అస్సాం వేదికగా జరిగిన జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (బీసీ రాయ్ ట్రోఫీ)లో విజేతగా నిలిచిన తెలంగాణ టీమ్‌ను గురువారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక గచ్చిబౌలి స్టేడియంలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన జ్ఞాపకార్థం హాకీ మ్యాచ్ నిర్వహించారు. సాట్‌జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, సాట్‌జీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నది. క్రీడారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి నూతన పాలసీతో పాటు యంగ్‌ఇండియా స్పోర్ట్స్‌యూనిర్సిటీ నెలకొల్పబోతున్నాం' అని అన్నారు. మరోవైపు ఒలింపియన్లు నిఖత్‌జరీన్, ఇషాసింగ్‌కు రూ.5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

# వరదలో చిక్కుకున్న రాధా యాదవ్



- **ఎన్డీఆర్ఎఫ్ సాయంతో బయటకు..**

వడోదర: గుజరాత్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి జనజీవనం అతలాకుతలమవుతోంది. భారత మహిళల క్రికెట్ జట్టు ప్లేయర్, లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ రాధా యాదవ్ సైతం వరదలో చిక్కుకుంది. వడోదరలోని సొంత నివాసంలో ఉండగా అక్కడి ప్రాంతాలను వరద ముంచెత్తడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) సాయంతో రాధాతో పాటు అక్కడి జనం వరద ప్రమాదం నుంచి బయటపడ్డారు.



# ఎంబాపే 'ఎక్స్' ఖాతా హ్యాక్

- **వివాదాస్పద పోస్టులతో హల్‌చల్**

పారిస్: ఫుట్‌బాల్ యువ సంచలనం, ఫ్రాన్స్‌కు చెందిన కిలియన్ ఎంబాపే 'ఎక్స్' ఖాతా హ్యాక్ అయింది. గురువారం అతడి ఖాతా నుంచి అనుచిత పోస్టులు కనబడటంతో ఎంబాపే అభిమానులతో పాటు ఫుట్‌బాల్ క్రీడాలోకం కలవరపాటుకు గురైంది. ఎంబాపే అకౌంట్‌ను హ్యాక్ చేసిన హ్యాకర్లు.. ఇజ్రాయెల్, క్రిప్టో కరెన్సీ, మాంచెస్టర్ సిటీ (ఫుట్‌బాల్ ఫ్రాంచైజీ), లియోనల్ మెస్సీపై అనుచిత కామెంట్స్ పెట్టారు. 'ఫుట్‌బాల్‌లో ఆల్ టైమ్ గ్రేట్ అంటే ఎప్పటికీ రొనాల్డోనే. ఈ వ్యక్తి నాకు ఆదర్శం కాదు' అంటూ లియోనల్ మెస్సీ ఏడుస్తున్న ఫొటోను షేర్ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అయింది. ప్రముఖ ఫుట్‌బాల్ ఫ్రాంచైజీ అయిన మాంచెస్టర్ సిటీని విమర్శిస్తూ పెట్టిన పోస్టులు వివాదాస్పదమయ్యాయి. ఈ పోస్టులను పోస్టు చేసిన కొద్దిసేపటికే హ్యాకర్లు వీటిని డిలీట్ చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# ముంబై లక్ష్యం 510

కోయంబత్తూరు: భారత జట్టుకు ఆడే స్టార్ క్రికెటర్లు తలపడుతున్న బుచ్చిబాబు టోర్నమెంట్‌లో ముంబై ఎదుట తమిళనాడు 510 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో 379 రన్స్ చేసిన తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు ముంబై ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే చేతులెత్తేసింది. సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్ వంటి అంతర్జాతీయ స్టార్లు ఉన్న ముంబై మూడో రోజు ఆటముగిసే సమయానికి 6/0 పరుగులు చేసింది.

# భారత్ శుభారంభం

**సత్తాచాటిన ఆర్చర్ శీతల్‌దేవి**

**బ్యాడ్మింటన్‌లో షట్లర్ల ముందంజ**

**పారిస్ పారాలింపిక్స్**



పారిస్: ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ శుభారంభం చేసింది. పోటీల తొలి రోజైన గురువారం మన పారా అథ్లెట్లు వేర్వేరు విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా పారా ఆర్చర్ శీతల్‌దేవి అంచనాలకు మించి రాణించింది. బరిలోకి దిగింది తొలిసారే అయినా ఎక్కడా తడబాటుకు లోనుకాకుండా రాణించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఓపెన్ ర్యాంకింగ్ రౌండ్‌లో శీతల్‌దేవి 703 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో టర్కీ ఆర్చర్ ఒజ్నూర్ గిరిడి కుర్ 704(ప్రపంచ రికార్డు) టాప్‌లో నిలిచింది. రెండో స్థానంలో నిలువడం ద్వారా 17 ఏండ్ల శీతల్ నేరుగా రౌండ్-16కు అర్హత సాధించగా, ఇదే విభాగంలో మరో ఆర్చర్ సరితాదేవి(682) తొమ్మిదో స్థానం దక్కించుకుంది. అదే జోరు కొనసాగిస్తూ మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్‌దేవి, ఆర్ కుమార్ ద్వయం ప్రపంచ రికార్డు(1399) స్కోరుతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నారు. చెక్కు చెదరని గురితో ఈ ఇద్దరు కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు.

**షట్లర్ల జోరు:**

భారత షట్లర్లు అదరగొట్టారు. వ్యక్తిగత విభాగంలో ఎనిమిది షట్లర్లు తదుపరి రౌండ్‌కు అర్హత సాధించారు. సుహాస్, సుకాంత్ కదమ్, తరుణ్(ఎస్ఎల్ 4), నితీశ్‌కుమార్(ఎస్ఎల్ 3), పాలక్ కోహ్లీ(ఎస్ఎల్ 4), తులసిమతి మురుగేశన్(ఎస్‌యు 5), మనీశ రామదాస్(ఎస్‌యు 5), నిత్యశ్రీ సుమతి శివన్(ఎస్‌హెచ్ 6) తొలి రౌండ్లలో ప్రత్యర్థులపై విజయాలు సాధించారు. ఇదిలా ఉంటే మహిళల 47కిలోల కే44 విభాగంలో అరుణాసింగ్ తన్వర్ 0-19తో నురిచియాన్(టర్కీ) చేతిలో ఓటమిపాలైంది. మహిళల సైక్లింగ్ పర్స్యూట్‌లో జ్యోతి గదేరియా పదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.



# జొకో జోరు

**రూడ్, షెల్టన్, గాఫ్ ముందంజ.. క్రెజికోవాకు షాక్**

న్యూయార్క్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ రేసులో ఉన్న దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో జొకో 6-4, 6-2, 2-0తో సెర్బియాకే చెందిన లాస్లో జెరెపై గెలిచాడు. ప్రత్యర్థి నుంచి ఏమాత్రం ప్రతిఘటన లేకుండానే జొకో ముందంజ వేశాడు. మూడో సెట్‌లో జెరె గాయంతో ఇబ్బందిపడి కోర్టును వీడటంతో జొకో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాడు. అతడితో పాటు రెండో రౌండ్‌లో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 7-6 (7/5), 6-1తో ముల్లర్ (ఫ్రాన్స్)ను ఓడించగా.. కాస్పర్ రూడ్ (నార్వే) 6-4, 6-2, 2-6, 7-6 (7/3) మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)ను చిత్తుచేశాడు. ఆండ్రీ రుబ్లెవ్, ఫ్రాన్సెస్ టియాఫో (యూఎస్ఏ), టేలర్ ఫ్రిట్జ్ (యూఎస్ఏ), బెన్ షెల్టన్ సైతం మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు.

**గాఫ్, సబలెంక దూకుడు**

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ జోరు కొనసాగిస్తోంది. రెండో రౌండ్‌లో ఈ అమెరికా అమ్మాయి 6-4, 6-0తో టట్జన మరియ(జర్మనీ)ని వరుస సెట్లలో చిత్తుచేసి అలవోక విజయం అందుకుంది. బెలారస్ భామ ఎరీనా సబలెంక 6-3, 6-1తో బ్రొన్‌జెట్టి (ఇటలీ)ని మట్టికరిపించింది. విక్టోరియా అజరెంకా (బెలారస్), జెంగ్ (చైనా) తదుపరి రౌండ్‌కు చేరగా 8వ సీడ్, మాజీ వింబుల్డన్ చాంపియన్ అయిన బార్బొర క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)కు 6-4, 7-5తో ఎలీనా గాబ్రియాలా రుస్ (రొమేనియా) షాకిచ్చింది.



# బ్రిజ్ భూషణ్‌కు కోర్టులో దక్కని ఊరట

ఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో చుక్కెదురైంది. బ్రిజ్‌భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ గతేడాది ఆరుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేయగా ఢిల్లీ పోలీసులు ఆయనపై చార్జిషీట్ దాఖలు చేశారు. అయితే తనపై ప్రతీకారంతో కొంతమంది కావాలనే ఇలా చేస్తున్నారని, ఈ కేసులో విచారణను నిలిపివేయాలని బ్రిజ్‌భూషణ్ తరపున న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా కోర్టు స్పందిస్తూ.. బ్రిజ్‌భూషణ్‌పై కేసును ఎందుకు కొట్టివేయాలనే దానిపై పూర్తి వివరాలను పొందుపరుస్తూ షార్ట్ నోట్ ఇవ్వాలని ఆదేశించింది.

# కివీస్ బౌలింగ్ కోచ్‌గా జాకబ్ ఓరమ్

ఆక్లాండ్: ఈ ఏడాది అక్టోబర్‌లో భారత పర్యటనకు రానున్న న్యూజిలాండ్ జట్టుకు కొత్త బౌలింగ్ కోచ్ వచ్చాడు. ఆ దేశ మాజీ పేసర్ జాకబ్ ఓరమ్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరుకోవడానికి న్యూజిలాండ్‌కు భారత పర్యటన కీలకం కాగా ఓరమ్ వంటి మాజీ పేసర్ అనుభవం కివీస్‌కు పనికొస్తుందని ఆ జట్టు భావిస్తోంది. 11 ఏండ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో ఓరమ్.. 33 టెస్టులు, 160 వన్డేలు, 36 టీ20లు ఆడి 250 వికెట్లు పడగొట్టాడు.

# రూట్ సెంచరీ

లండన్: శ్రీలంకతో స్వదేశంలో లార్డ్స్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ మొదటి రోజే భారీ స్కోరు చేసింది. ఆ జట్టు మాజీ సారథి జో రూట్ (143) భారీ శతకంతో కదం తొక్కడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్.. 88 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. రూట్‌కు మొత్తంగా 49వది. అట్కిన్సన్ (74 నాటౌట్), డకెట్ (40), బ్రూక్ (33) రాణించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.